నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, ఆదివారం 30 జూన్ 2024 | RANGAREDDY

ఎమ్మెల్యే కాలె యాదయ్య దిష్టి బొమ్మను దహనం చేసిన బీఆర్ఎస్ శ్రేణులు

సొంత ప్రయోజనాల కోసమే
పార్టీ మారిండు

రాబోవు రోజుల్లో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యకు గుణపాఠం తప్పదు

తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల మాజీ చైర్మన్ నారాయణ

చేవెళ్ల టౌన్, జూన్ 29 : సొంత ప్రయోజనాల కోసమే చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పార్టీ మారాడని, ఇది కరెక్టు కాదని తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల మాజీ చైర్మన్ నారాయణ ఖండించారు. శనివారం చేవెళ్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే కాలె యాదయ్య దిష్టిబొమ్మను బీఆర్ఎస్ శ్రేణులు దహనం చేశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ తరపున రెండు సార్లు బీఫామ్ తీసుకుని గెలిచిన కాలె యాదయ్య పార్టీకి ద్రోహం చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి కార్యక్రమాలు ఎన్నో జరిగాయని, కాంగ్రెస్ పార్టీ పెద్ద లీడర్ల ఒత్తిడికి తలొగ్గి లొంగిపోవడం సరికాదన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు చింతించాల్సిన అవసరం లేదని ఇటువంటి ద్రోహులు వస్తూపోతుంటారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టే పేదలకు శ్రీరామ రక్ష అని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే యాదయ్య తీసుకున్న నిర్ణయాన్ని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు సైతం సమ్మతించలేదని, రాబోవు రోజుల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రాత్రికి రాత్రే ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ పార్టీలో చేరడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ పార్టీకి మళ్లీ పూర్వవైభవం రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలయ్యేలా పట్టుబట్టి ప్రజల తరపున పోరాడుతామన్నారు. బీఆర్ఎస్ శ్రేణులమంతా కేసీఆర్, కేటీఆర్ సూచనల మేరకు ముందుకు సాగుదామన్నారు. ఈ కార్యక్రమంలో నవాబుపేట మండలంలోని మారేడుపల్లి ఎంపీటీసీ విజయ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి దశరథ్, లక్ష్మీనర్సింహా రెడ్డి, అష్షర్ ఖాన్, ఎజాజ్, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాలె యాదయ్య ద్రోహి

ద్రోహంపై ధ్వజమెత్తిన బీఆర్ఎస్ నేతలు

మొయినాబాద్, జూన్ 29 : చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ద్రోహి అని, పదేండ్లు అధికారంలో ఉన్నప్పుడు అన్ని రకాలుగా లబ్ధి పొంది విశ్వాసాన్ని మరిచాడని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి విమర్శించారు. శనివారం మండల పరిధిలోని అంజనాదేవి గార్డెన్‌లో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ తరపున రెండుసార్లు బీఫామ్ తీసుకుంటే కార్యకర్తల నిరంతర కృషి, మాజీ సీఎం కేసీఆర్ వల్ల గెలిచారని, ఆయన గొప్పేమిలేదన్నారు. యాదయ్య కుటుంబానికి అన్ని విధాలుగా లబ్ధి చేకూర్చిన బీఆర్ఎస్ పార్టీని వదిలి వెళ్లడం సరికాదన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో చర్చించకుండా రాత్రికిరాత్రే కాంగ్రెస్‌లో చేరడం బాధాకరమన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసినప్పుడు ఐదేండ్ల తరువాత బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే యాదయ్యకు మంత్రివర్గంలో చోటు కల్పించనున్నట్లు హామీ ఇచ్చారని చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ నాయకత్వంలో పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. త్వరలో పార్టీ కమిటీని ఏర్పాటు చేసుకుని పార్టీ బలోపేతానికి ముందడుగు వేస్తామన్నారు.

సమావేశంలోఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మోర శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గడ్డం వెంకట్‌రెడ్డి, ఎ.గణేశ్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్‌యాదవ్, ఎంఏ రావూప్, ప్రధాన కార్యదర్శి నర్సింహా గౌడ్, రైతు సమన్వయ సమితి మాజీ కన్వీనర్ శ్రీహరియాదవ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్లు దారెడ్డి వెంకట్‌రెడ్డి, డప్పు రాజు, మాజీ డైరెక్టర్లు కుమ్మరి రాము, భిక్షపతిగౌడ్, బీఆర్ఎస్ లీగల్ సెల్ మండల అధ్యక్షుడు సురేందర్‌గౌడ్, కో ఆప్షన్ సభ్యుడు బిలాల్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు రాజశేఖర్, యువత మండల అధ్యక్షుడు పరమేశ్, మాజీ అధ్యక్షుడు నవీన్, సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ, నర్సింహారెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు అనంతరెడ్డి

కలెక్టర్‌ను కలిసిన జిల్లా ఎస్పీ

వికారాబాద్ ఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన నారాయణరెడ్డి శనివారం వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.
-వికారాబాద్, జూన్ 29

కేసీఆర్‌తో కళకళ.. కాంగ్రెస్‌తో 'కట్'కట

రాష్ట్రం రాకముందు కరెంట్ ఎప్పడొస్తదో, ఎప్పడు పోతదో తెల్వదు. కోతలతో ఇబ్బందులు పడ్డం. చుక్కనీరందక వ్యవసాయ భూములు నెర్రెలు బారాయి. రెండు, మూడు గంటలు ఇచ్చే కరెంట్‌తో పనులు కుంటుపడ్డయ్. కేసీఆర్ వచ్చినంకనే నిరంతర విద్యుత్‌తో పదేండ్లు పండుగలా ఎవుసం చేసుకున్నం. పంటలు మంచిగ పండించుకున్నం. రాత్రిపూట పాలం కాడికి పోవుడు తప్పింది. ప్రాజెక్టులు కట్టి మస్తు నీళ్లిచ్చిండు. 24 గంటల కరెంట్‌తో చేతి నిండా పని దొరికింది. విద్యుత్ సమస్యల్లేకుండా తెలంగాణ తలరాతను మార్చిన పెద్దాయనపై నిందలేయడం సరి కాదు. 2014కు ముందున్న కష్టాలే మళ్లా ఇప్పుడు కాంగ్రెసోళ్లు వచ్చినంక మొదలైనయ్. చెప్పకుండా కోతలు పెడుతున్నరు. యాసంగిలో కరెంట్ లేక పంటలు ఎండిపోయినయ్. నీళ్ల కోసం అరిగోసపడ్డం. ఈ సీజన్‌లోనైనా సక్కగ వస్తదో, రాదో తెలుస్తలేదు. ఇప్పడే ఇన్ని కష్టాలుంటే ముస్కుందు ఎలాగుంటుందో' అని రైతులు, చిరు వ్యాపారులు తమ మనోగతాన్ని వెల్లడించారు.
- న్యూస్ నెట్‌వర్క్ (నమస్తే తెలంగాణ), జూన్ 29

- పదేండ్లు పండుగలా ఎవుసం
- చేతినిండా పని చేసుకున్న చిరు వ్యాపారులు
- కరెంట్ విషయంలో పెద్దాయనపై నిందలేయడం సరికాదు
- మళ్లీ 2014కు ముందు పరిస్థితులే పునరావృతం
- యాసంగిలో కరెంట్ లేక ఎండిన పంటలు
- రైతులు, చిరు వ్యాపారుల మనోగతం

కాంగ్రెస్‌తో తప్పని కరెంటు వెతలు..

గతంలో కేసీఆర్ సార్ రైతులకు 24 గంటలూ నాణ్యమైన కరెంటును సరఫరా చేయడంతో రైతులు పండుగలా వ్యవసాయం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రైతులకు కరెంటు కష్టాలు మొదలయ్యాయి. తెలంగాణకు ముందు రైతులు ఎటువంటి గోసలు పడ్డారో మళ్లీ ఇప్పుడు అటువంటి బాధలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎప్పుడు కరెంటు ఉంటుందో.. ఎప్పుడు ఊడుతుందో తెలియని అయోమయ పరిస్థితి. బోర్లు ఉన్నా పొలాలకు నీళ్లు అందించలేకపోతున్నాం. సరిగ్గా కరెంటు లేక.. సకాలంలో వర్షాలు లేక ఇబ్బందులు పడుతున్నాం.
– రాఘవేందర్‌రెడ్డి, రైతు, రుద్రారం, కొడంగల్

బీఆర్ఎస్ హయాంలోనే రైతులకు మేలు..

తెలంగాణ రాక ముందు కరెంటు లేకపోవడం వల్ల రైతులు వ్యవసాయం చేసుకోవాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉండేది. తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్ సారధ్యంలో తెలంగాణలో కరెంటు కష్టాలు పూర్తిగా తొలగిపోయాయి. రైతన్నల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద పీట వేసి.. వ్యవసాయానికి 24 గంటలూ నాణ్యమైన కరెంటును సరఫరా చేసింది. అందుకే రైతులు నేడు కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ వచ్చిన నాటి నుంచి కరెంటు కష్టాలు మొదలయ్యాయి. గృహాలకూ నాణ్యమైన కరెంటు సరఫరా అందుతలేదు.
– శివరాంరెడ్డి, రుద్రారం, కొడంగల్

గతంలోనే కరెంటు బాగుండేది..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే విద్యుత్ సరఫరా బాగుండేది. వ్యవసాయానికి, గృహావసరాలకు 24 గంటల విద్యుత్ సరఫరా చేసేవారు. ప్రస్తుతం విద్యుత్ సరఫరాలో తరుచూ అంతరాయాలు కలుగుతున్నాయి. గృహాలలో కరెంటు బాగా పోతున్నది. అధికారులను అడిగితే పైనుంచే నిలిచిపోయింది అని సమాధానం చెబుతున్నారు. అంతరాయం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయి.
–లక్ష్మీనారాయణ, రైతు, దుప్‌చెర్ల, బొంరాస్‌పేట

పదేండ్లు కరెంట్ కోతలు చూడలేదు..

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అయినంక వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిండు. పదేండ్లలో కరెంట్ కోతలు లేకుండా చేసిండు. ప్రతి రైతూ కేసీఆర్ పాలనలో వ్యవసాయాన్ని పండుగలా చేసుకున్నాడు. వ్యవసాయ రంగంతో పాటు గృహాలకూ నిరంతర విద్యుత్ అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కింది. కాంగ్రెస్ పాలన ప్రారంభమైనప్పటి నుంచి కరెంట్ కష్టాలు మొదలయ్యాయి. కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలుస్తలేదు.
– కాలె వీరయ్య రైతు, మూర్తుజపల్లి, ఆమనగల్లు మున్సిపాలిటీ

జిల్లాలో చుట్టపుచూపుగా వస్తున్న వానలు

10 వేల ఎకరాల్లో మొలకెత్తని విత్తనాలు

ఇప్పటివరకు 1.74 ఎకరాల్లో ఆయా పంటల సాగు

అత్యధికంగా 1.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు

27 వేల ఎకరాల్లో కంది, 5500 ఎకరాల్లో మొక్కజొన్న సాగు

జూలై 15 వరకు పత్తి, కంది విత్తనాలు నాటేందుకు అనుకూలం

ఆన్‌లైన్‌లో కొనసాగుతున్న పంటల వివరాలు నమోదు

పత్తి సాగుకే మొగ్గు

వికారాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో వర్షాలు అంతంత మాత్రంగానే కురుస్తున్నాయి. కురిసిన తేలికపాటి జల్లులతో ఇటీవల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో ఈనెల మొదట్లో కురిసిన వర్షానికి రైతులు విత్తనాలను నాటగా ఆ తర్వాత వరుణుడు మొహం చాటేశారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 10 వేల ఎకరాల్లో విత్తనాలు మొలకెత్తకపోవడంతో రైతులు మళ్లీ విత్తనాలను నాటే పనిలో బిజీ అయ్యారు. జూన్ నెలలో సాధారణ వర్షపాతం 108.3 మి.మీటర్ల వర్షపాతం నమోదు కాగా, నెల ముగుస్తున్నా 97.5 మి.మీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. విత్తనాలు, ఎరువులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా వ్యవసాయ శాఖ అవసరమైన చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 40 వేల ఎకరాల పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ పూర్తైంది.

1,74,651 ఎకరాల్లో ఆయా పంటల సాగు..

జిల్లాలో వానకాలం పంటల సాగు దాదాపు 2 లక్షల ఎకరాల చేరువలో ఉన్నది. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 1,74,651 ఎకరాల్లో ఆయా పంటలు సాగయ్యాయి. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా జిల్లా రైతాంగం పత్తి పంట సాగువైపే మొగ్గు చూపుతుండడం గమనార్హం. జిల్లాలో ఇప్పటివరకు సాగైన ఆయా పంటల్లో 80 శాతం మేర పత్తి పంటను సాగు చేశారు. జూలై 15 వరకు పత్తి పంటతోపాటు కంది పంటను సాగు చేసేందుకు అనుకూలమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మరోవైపు వరితో పాటు మిగతా పంటలు ఆగస్టు రెండో వారం వరకు సాగు చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో ఈ వానకాలం సీజన్‌లో 5.97 లక్షల ఎకరాల్లో ఆయా పంటలు సాగవుతున్నాయని జిల్లా వ్యవసాయాధికారులు ప్రణాళికను రూపొందించారు. పత్తి 2,63,500 ఎకరాలు, కంది 1.50 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 50,450 ఎకరాలు, వరి 1.10 లక్షల ఎకరాలు, మినుములు 5 వేల ఎకరాలు, సోయాబీన్ 2500 ఎకరాలు, జొన్నలు-2500 ఎకరాలు, పెసలు 13 వేల ఎకరాల్లో సాగవుతున్నట్లు అంచనా వేశారు. ఇప్పటివరకు 1,74,651 ఎకరాల్లో ఆయా పంటలు సాగు కాగా, పత్తి-1,33,626 ఎకరాలు, వరి-91 ఎకరాలు, మొక్కజొన్న 5564 ఎకరాలు, కందులు-27,553 ఎకరాలు, జొన్న 228 ఎకరాలు, మినుములు-994 ఎకరాలు, పెసలు 5216 ఎకరాలు, సోయాబీన్-892 ఎకరాలు, బఠానీ-220 ఎకరాల్లో రైతులు సాగు చేశారు.

అందుబాటులో సరిపోను ఎరువులు..

జిల్లా రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సరిపోను ఎరువులను అందుబాటులో ఉంచారు. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలోనూ ఏఈవోలు క్షేత్రస్థాయిలో పంటల సర్వే నిర్వహిస్తుండడంతో ఎరువులు, విత్తనాలు ఎంతమేర అవసరమనేది ముందస్తు ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. యూరియా, డీఏపీ, ఎన్‌పీకేఎస్, ఎంవోపీ, ఎస్ఎస్‌పీ ఎరువులు అన్ని కలిపి 75,437 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని జిల్లా వ్యవసాయాధికారులు అంచనా వేశారు. జిల్లావ్యాప్తంగా యూరియా 32,329 మెట్రిక్ టన్నులు, డీఏపీ 17,719 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 19,877 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 3658 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 1854 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని సంబంధిత అధికారులు అంచనా వేయగా, జిల్లాలో ఇప్పటివరకు యూరియా 15,317 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1273 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 2477 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 192 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 106 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాలోని గోదాముల్లో నిల్వ ఉంచారు. జిల్లాలో పీఏసీఎస్, డీలర్లు, కంపెనీ గోదాంలు, మార్క్‌ఫెడ్, వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల ద్వారానే ఎరువులు సరఫరా అవుతున్నాయి. ఎరువుల విక్రయ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఉండేలా జిల్లాయంత్రాంగం ఆన్‌లైన్ విధానాన్ని తీసుకొచ్చింది. స్టాక్ పాయింట్ నుంచి జిల్లాకు ఎంత సరఫరా అయ్యింది, జిల్లాలోని స్టాక్ పాయింట్ ద్వారా ఆయా ఎరువుల దుకాణాలను ఎంతమేర ఎరువులు సరఫరా అయ్యాయనే వివరాలతోపాటు జిల్లాలోని ఎరువుల దుకాణాల నుంచి రైతులు ఎంతమేర కొనుగోలు చేశారనే పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తున్నది.

జూలై రెండోవారం వరకు పత్తి సాగుకు అనుకూలం...

జూలై 15 వరకు పత్తి, కంది పంటల సాగుకు అనుకూలం. మిగతా పంటలు ఆగస్టు రెండో వారం వరకు విత్తుకోవచ్చు. జిల్లావ్యాప్తంగా సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయి.
– గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి

కాంగ్రెస్ పార్టీని దోషిగా నిలబెడుతాం

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు

కడ్తాల్, జూన్ 29 : ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలతోపాటు ఇతర హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక.. హామీలను విస్మరించి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నదని ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, సుంకి రాజేందర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఉప్పల వెంకటేశ్ ఇంట్లో మాజీ ఎమ్మెల్యేలతో పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తన ఇంటికి వచ్చిన మాజీ ఎమ్మెల్యేలకు వెంకటేశ్ ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఉప్పల వెంకటేశ్‌తో కలిసి మాజీ ఎమ్మెల్యేలు అక్కడ ఉన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం చెందిందని అన్నారు. ఏడు నెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజల ముందు దోషిగా నిలబెట్టే సమయం ఆసన్నమైందని మాజీ ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. రాష్ట్రంలో త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును గ్రామగ్రామాన ఎండగడుతూ బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకుని వచ్చేలా భవిష్యత్తు కార్యాచరణ ఏర్పాటు చేసుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నిత్యం వివిధ వర్గాలు తమకు జరుగుతున్న అన్యాయాలను వివరిస్తూ పోరుబాట పట్టిన ఉదంతాలను మాజీ ఎమ్మెల్యేలు వివరించారు. పాల బిల్లుల కొరకు, రైతుబంధు, రుణ మాఫీ కొరకు రైతులు, ఉద్యోగాల కొరకు నిరుద్యోగులు, తాగునీటి కోసం మహిళలు, కరెంట్ కోతలను నిరసిస్తూ చిన్న, పెద్ద పారిశ్రామిక వేత్తలు ఇలా అన్ని రంగాల ప్రజల ఆందోళన పడుతుంటే... కాంగ్రెస్ నాయకులు, ముఖ్యమంత్రి, మంత్రులు మాత్రం హైదరాబాద్- ఢిల్లీకి ప్రయాణాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. విషపూరిత రాజకీయాలను చేస్తూ ప్రజా సమస్యలను తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. ఇలాంటి వారినా మనం ఎన్నుకున్నదని రాష్ట్ర ప్రజలు మదనపడుతున్నారని, రాబోయే రోజులన్ని బీఆర్ఎస్ పార్టీవేనని, బీఆర్ఎస్‌తోనే రాష్ట్రంలో స్వర్ణయుగ పాలన సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యేలు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, నరేశ్‌గౌడ్, బుచ్చిబాబు, ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు